

సుశీల సన్నగా నాజూగ్గా వుంటుంది.

పుట్టింది పల్లెటూర్లో అయినా బస్తీలో పనిచేస్తున్న చలమయ్యతో వివాహం అయి, సంవత్సరం పైగా కాలంలో ఎన్నో నేర్చుకుంది. మచ్చుకు ఒక్కటి చెబితే మీకు ఆ పిల్ల ఎన్ని నేర్చుకుందో బాగా అర్థమవుతుంది. పెళ్ళికి పూర్వం ఖద్దరు బాడీలు ముతక రవిక లోపల వేసి సిగ్గుపడిపోయేదల్లా, 'న్యూలుక్' బ్రాలు బయటకనిపించే లోనెక్ బ్లౌజులో వేసి, సరదాగా చలమయ్యతో సాయంత్రం— వారుసుకుని వెళ్ళే మగ వాళ్ళను పట్టించుకోనట్టుగా— బజార్లో వెళుతుంటూంది. సుశీలకు అందరిలాగానే తన వంకా, తన అందంవంకా, వో పదిమంది చూడాలనే కుతూహలం వుంది.

ఆ వీధిలోని వాళ్ళు ఇల్లుమారి పది రోజులయింది. పిన్నింటికి దగ్గర్లోనే— మేడ మీది వాటా పడగ్గదీ, వంటగదీ, ముందు

టి. సీతారామయ్య

వరండా. సుశీలకు బాగానచ్చింది కొత్త యిల్లు. ఏమీ పనిలేదు. తోచక వుట్టినే చూస్తూంటుంది బజార్లోకి. అయితే ఒక విచిత్రం వేసింది సుశీలకు.

ఎదురుగా ఇంట్లో ఒక ఎర్రటి అందంగా కనిపించే తన వయసు అమ్మాయి వుంది. పదిరోజులుగా ఆ అమ్మాయిని ప్రతిరోజూ చూస్తోంది. చిన్నగా చేతిని కదిలిస్తుంది. రోజూ వో నలుగురయిదుగురు మగాళ్ళు అలా ఆ అమ్మాయి చేతిని కదిలించీ కదిలించనట్టు చేయగానే, ఎంతో పాత పరిచయస్థులు లాగా, తలుపు నెట్టుకుని లోపలకు వెళ్తరుతా. కొంత సేపయిన తర్వాత, అతను బయటకు వచ్చేస్తాడు. సుశీల– విషయ మేమిటో అర్థం చేసుకోలేనంత అమాయకపు మనిషే ంకాదు.

సుశీలకు ఉన్న ఆశ్చర్యం అంతా ఒక్కటే. ఏమిటి ఇలా ప్రతిరోజూ ఆ పిల్ల పిలవగానే వెళ్ళడం! అది ఏ రకంగా చూసినా పిలుపులా అనిపించదు. చాలా నేర్పు వుంది ఆ పిలుపులో. సుశీల పడగ్గదిలో మంచాని కెదురుగా ఉన్న పెద్ద అద్దంముందు కూర్చుని చిలిపిగా ఎన్నిసార్లో ఆమెను అనుకరించింది.

సాయంత్రం ఆఫీసునుంచి చలమయ్య వచ్చిన తర్వాత ఆ ఎదురింటి అమ్మాయిలా కళ్ళలో భావాల్ని కుదించి, మత్తుగా ముగ్ధగా చేత్తో సంజ్ఞచేసింది. చలమయ్యకు అర్థం-కాలా. ఏదో ఆలోచించుకుంటూ గమనించనే లేదు. భాద స్తపు మొగుడికి చెపితే తెలియదు, కొడితే ఏడుస్తాడు– అంది సుశీల నవ్వుతో చలమయ్య చుబుకాన్ని పట్టుకుని. చలమయ్య నవ్వేడు. గలగలా నవ్వేడు. సుశీల సుతారంగా అతని బుగ్గలమీద ముద్దు పెట్టింది. సుశీల అతనిపైన వాలి, ఫలానా సిన్మాలో లాగా అతని మొహంలో మొహం వుంచి, అతని పెదాలవంక, విచ్చిన తన పెదాలతో పరవసిస్తో చూసింది.

చలమయ్య పెద్దమనిషి. అతను దేన్నీ బాహాటంగా చెప్పలేడు. అంచేత మౌనంగా ఆమెవంక చూస్తూ వుండిపోయేడు.

ఒకటి రెండుసార్లు సుశీల ఫలానా సినిమాలో కథానాయకుడు కథానాయకిని చేసిన శృంగారం చేయమని అడిగింది. ఇంగ్లీషు సినిమాచూసిరాగానే అందులోలాగా పెదాల మీదముద్దు పెట్టుకోమని పురమాయించింది. చలమయ్య భార్య మాటను మన్నిస్తాడు.

* * *

ఎదురింటి ఎర్రపిల్ల పిల్చింది. అహ... పిలవలేదు, సంజ్ఞ చేసింది. ఆ సంజ్ఞను పరిశీలనగా చూసింది సుశీల. తలుపు తోసుకుని ఒకవ్యక్తి లోపలికి వెళ్ళి తలుపు వేస్తున్నాడు.

చాల అబ్బురపడింది సుశీల.

వరండా ముందుకొచ్చి వీధి మీదికంటా నిలబడింది.

నడివయస్సువుంటుంది చూడ్డానికి బాగానే వున్నాడు. తలుపువంకే చూస్తూ ముందుకు సాగిపోయేడు. సందుచివర్నుంచి నిలబడి మళ్ళీ ఇటువైపు వస్తున్నాడు.

అతనికి ఎలాతెలుసు ఆ ఎర్రటమ్మాయి మరో వ్యక్తితో లోపల వున్నదని! తల్లకిందులుగా ఆలోచించింది సుశీల.

అతను హఠాత్తుగా తలఎత్తి సుశీల వంక చూశాడు.

సుశీల అతనివంక చూసింది. కళ్ళతో సంజ్ఞ చేసింది. చేతిని కదిల్చిందికూడా. అచ్చు ఆ ఎర్రమ్మాయి చేసినట్టే చేసింది. నిన్న సాయంత్రం తను చలమయ్య ముందు చేసిన విధంగానే.

అతని పెదాలమీద చిరునవ్వు. అతను చిన్నగా ఈలవేశాడు. కిందివాళ్ళ వరండా పక్క మెట్లెక్కి వస్తున్నాడు అప్పుడు అర్థమయింది సుశీలకు తను చేసినపని. అంతవరకూ అలవాటుగా, అద్దంముందూ, చలమయ్యముందూ చేసిన అనుకరణ, తను ఈ కొత్తవ్యక్తి ముందుకూడా చేసినట్టు తెలిసింది. నోట మాటరానంత బిగుసుకుపోయింది సుశీల. పర్యవసానం ఆలోచించుకోక చేసినపని.

*   *   *

''పిన్నీ ఇలా జరిగింది. నేను పతితనైపోయాను. ఆయనకు ద్రోహం చేశాను'' అంటూ భోరున విలపించింది సుశీల.

''పిచ్చిపిల్లా'' అంది సుబ్బడు పిన్ని.

''నేను వ్యభిచరించేనా?'' అని అడిగింది సుశీల బిక్కమొహం పెట్టి.

''ఛ. అలా అనకు. నువ్వు నిస్సహాయ స్థితిలో మరోళ్ళ చేత అనుభవించబడ్డావు. నీకు స్వతహాగా అలా చేయాలని లేదుగా. అందుచేత నువ్వు వ్యభిచరించలేదు వాడు వ్యభిచరించాడు. పతితా పతివ్రతా ఏమిటమ్మా—ఒక మొగుణ్ణొదిలి, ఇష్టం లేని రోజున అతగాడికి విడాకులిచ్చి మరోణ్ణి చేసుకునే పద్ధతులూ ఇవీ ఇన్నివుంటే నీ తప్పు లేనప్పుడు నీవెలా వ్యభిచరించావు?'' అని తేల్చిపారేసింది సుబ్బడు పిన్ని.

సుశీలకు కొంచెం సమంజసమనిపించింది.

''అయినా మన షోకుల్తో మొగుణ్ణి య్క్రెత్తించాలిగాని, బయటాళ్ళను కాదు.'' అని ముగించింది సుబ్బడు.

''మరి అతనిచ్చిన యాభై రూపాయలో?'' తన సందేహాన్ని తెలియబరచింది సుశీల.

సుబ్బడు పిన్ని ఒక ఇల్లెగిరిపోయేంత సరదా నవ్వు నవ్వింది— ''ఒక మంచి షర్టు పీస్ తీసి మీ ఆయనకు ప్రజంటేషను ఇయ్యి'' అంది.

*

## వచ్చే వారం:

- మట్టికి ప్రాణం పోసే మహా కళాకారులు (ప్రత్యేక వ్యాసం)
- మబ్బు తొలిగింది (కథ)
- మృణాల్ సేన్ కొత్త సృష్టి 'మృగయా'
- నిద్ర సుఖమెరగదు
- వయసొచ్చిన పిల్లలు గుండెలమీద కుంపట్లేనా?
- చాలినన్ని థియేటర్లు లేనప్పుడు శరపరంపరగా సినిమాలెందుకు?